www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

ప్రజాశక్తి-తొండూరు

సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ గుండెపోటుతో మృతి చెందిన విషాదకర ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక తొండూరు మండలానికి చెందిన ప్రకాశ్‌రెడ్డి(42) పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ ప్రాంతంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొన్ని రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చిన ఆయన, అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే పులివెందుల ఓ ప్రయివేట్ ఆసుపత్రి తరలించినారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆయన మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కష్టాల్లో.. ఖరీఫ్!

- పదును కోసం ఎదురుచూపు
- కడపలో 2.60, అన్నమయ్యలో 3.57 శాతంలోనే విత్తనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. 2025-26 జూన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి మాయంకావడం వంటి అనిశ్చితి పరిస్థితులు నెలకొనడంతో రైతాంగం నిరుత్సాహానికి గురవుతోంది. ఈ ఏడాది జూన్ ముగుస్తున్నప్పటికీ సాగు ఊపందుకోని వైనం ఆందోళన కలిగిస్తోంది. జులైలోనైనా ఆశించిన వర్షపాతం కురుస్తుందనే ఆశాభావంతో రైతాంగం ఎదురుచూస్తోంది. ప్రతి రోజూ సాయంత్రానికి కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, ఉస్సూరుమనిపించడం పరిపాటిగా మారింది. కడప జిల్లాలో 2.60 శాతం, అన్నమయ్యలో 3.57 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జులై నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో విత్తనం పడాల్సిన తరుణంలో మేఘాలు ఉస్సూరుమనిపిస్తుండడం ఆందోళన నెలకొంది.

ఉభయ జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయ శాఖల లక్ష్యం. కడప జిల్లాలో జూన్ మాసంలో నుంచి 4,974 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 2,036 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది కడప జిల్లాలో 8,467 ఎకరాల్లో, అన్నమయ్య జిల్లాలో 4,588 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 2.60 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 3.57 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన 97 శాతం పొలమంతా బీడుగా దర్శనమిస్తోంది. ఉభయ జిల్లాల రైతాంగం సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేసింది. పంటల సాగు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కడప జిల్లాలో ప్రధాన పంట వరి 76,085 ఎకరాల సాగుకుగానూ 701.48 ఎకరాలు, వేరుశనగ 14,760 ఎకరాల్లో సాగుకు గానూ 461 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. పత్తి 59,368 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 3,544 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 1.40,797 ఎక రాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు 2,036 వేల ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన జిల్లాలో 3.57 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన పంట వేరుశనగ. జిల్లాలో 93,892 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 3,974 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 3.97 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన పొలమతా బీళ్లుగానే దర్శనమిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో వర్షాభావం వెంటాడింది. 68.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 58.28 శాతం కురవాల్సి ఉండగా 18.9 శాతమే నమోదైంది. ఈలెక్కన -63.8 మిల్లీమీటర్ల వర్షపాతం, అన్నమయ్య జిల్లాలో 75.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 24.4 శాతమే కురిసింది. ఈలెక్కన -67.5 శాతం లోటు కొనసాగుతోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 36 మండలాలు ఉన్నాయి. ఇందులో ఏఒక్క మం డలంలోనూ సాధారణ వర్షపాతం నమోదు గాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా పంటల సాగు నత్తకనడకన సాగుతోంది. అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు ఉన్నాయి. ఇందులో ఒక్క మండలంలోనే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 29 మండలాల్లో ఎనిమిది మండలాల్లో లోటు వర్షాభావం నమోదు కాగా, మరో 20 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నిరాశాజక పరిస్థితులు నెలకొనడం విస్మయాన్ని కలిగిస్తోంది.

సాగు కోసం పొలం దుక్కులు చేస్తున్న రైతులు

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించండి

- నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అమెరికా ఆధిపత్య ధోరణి, ప్రపంచ దేశాలలో యుద్ధానికి అమెరికాయే కారణమని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. బుధవారం అంబేద్కర్ సర్కిల్ ఎదుట వామపక్ష పార్టీలు సంయుక్తంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అమెరికా ప్రపంచంపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన 104 యుద్ధాలు అమెరికా ఆర్మీ మారునాయుదాల వ్యాపార లాభాల కోసం ఉద్దేశ పూర్వకంగా ప్రేరేపించినవేనని తెలిపారు. ఒకవైపు ప్రపంచాన్ని ఉద్ధరించే వ్యాఖ్యలు చెప్పుతూ, మరోవైపు ప్రపంచంలో అనేక దేశాలలోని అత్యంత అరుదైన, విలువైన, నిక్షేపాలను, గనులను, ఆయిల్‌ను, గ్యాస్‌ను, దోపిడీ చేస్తోందన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధం, ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న దాడులు, రష్యాపై ఉక్రెను ఉసిగొలుపుతున్న యుద్ధం, చైనాపై తైవాన్‌ను రెచ్చగొడుతున్న ఉద్రిక్తతలు, ఉత్తర కొరియా, దక్షిణ కొరియాల మధ్య ప్రేరేపిస్తున్న యుద్ధ మేఘాలు అమెరికా ప్రేరేపితాలేనని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాదుల్లా మాట్లాడుతూ అమెరికా దుర్మార్గాలకు, ఇజ్రాయిల్ దురాక్ర మణలకు హద్దు పద్దు లేకుండా పోయిందని పేర్కొన్నారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి బి.ఓబయ్య మాట్లాడుతూ అమెరికా దుశ్చర్యలను అమెరికా ప్రజలు, అమెరికా సైన్యం హర్షించడం లేదని చెప్పారు. ఆర్ఎస్‌పి జిల్లా కార్యదర్శి కె.సుబ్బరాయుడు మాట్లాడుతూ నరేంద్ర మోడీ దేశ అలీన విదేశాంగ విధానాన్ని విస్మరించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జపం చేస్తున్నారని పేర్కొన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, ఆర్‌ఎంపిఐ జిల్లా కార్యదర్శి జి.రమణయ్య మాట్లాడుతూ పాలస్తీనా ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడులు మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, ఎ.అన్వేష్, కె.శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, సావన్ సుధాకర్, గోపి, నరసింహ, నాగరాజు, కమ్యూనిస్టు అభిమానులు డాక్టర్ గోపాల్, శివారెడ్డి, వామపక్ష ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్:** ప్రపంచంపై అమెరికా ఆధిపత్యం ధోరణిని వ్యతిరేకించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ తెలిపారు. బుధవారం మైలవరం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో మండల నాయకులు కొండయ్య అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పల్లా లక్ష్మీ నారాయణ, మునేయ్య, రామయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి-కడప అర్బన్

విఆర్ఎల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, నామినేలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ వ్యవస్థలో సుమారు 19,359 మంది విఆర్ఎలు పనిచేస్తున్నారని తెలిపారు. సుదీర్ఘకాలం నుంచి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని చెప్పారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం విఆర్ఏలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో చంద్రబాబు నాయుడు ఉన్న జీతాన్ని రూ.6,500 నుంచి రూ.10,500 చేశారని పేర్కొన్నారు. డిఎ రూ.300 ఇచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం డిఎని ఉపసంహరించి రికవరీ చేశారని విమర్శించారు. 12 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం విఆర్ఎల ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేయించుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన విఆర్ఎలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, కోశాధికారి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట చలపతి, వివిధ మండలాలకు చెందిన అధ్యక్షులు చిన్నన్న, రవి, సుబ్బరాయుడు, గురు మోహన్, ప్రతాప్, గంగులయ్య, వెంకటసుబ్బయ్య, పెద్ద నారాయణ, కిషోర్, సుబ్బయ్య, కొండయ్య పాల్గొన్నారు.

మైదుకూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం

- నియోజకవర్గ సమావేశంలో కలెక్టర్ శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-చాపాడు

మైదుకూరు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, అధికారులందరూ సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. బుధవారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మైదుకూరు ప్రాంతంలో ముఖ్యంగా వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి పాడి పరిశ్రమకు విరివిగా రుణాలు అందిస్తామని తెలిపారు. హార్టికల్చర్‌పై రైతులు దృష్టి సాధించాలన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, సూక్ష్మ పోషకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కెసి కెనాల్‌కు సాగునీరు అందించేందుకు అలగనూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయించారు కృషి చేస్తామని పేర్కొన్నారు. విత్తనాలు ఎరువులు కల్తీ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. అనుమతి లేని గడ్డి మందులు అమ్మకాలు చేపడితే వెంటనే దుకాణాలు సీజ్ చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఎరువుల దుకాణాలపై నిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని పేర్కొన్నారు ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. గ్రామ స్థాయిలో అధికారులు సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టు తిప్పుకోకుండా సమయపాలన పాటించాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి కలెక్టర్ సహకరిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పి అశోక్ కుమార్, జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిపిఒ రాజ్యలక్ష్మీ, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయి శ్రీ, చంద్రమోహన్, మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యంకు కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

వైసిపిలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం

-కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వై.ఎస్.జగన్

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాజంపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం బుధవారం వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో సుబ్రమణ్యానికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, పుంగనూరు నేత శ్రీనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పార్టీ తరపున సుగవాసి సుబ్రమణ్యంకు సముచిత గుర్తింపు, స్థానం లభిస్తుందని నేతలు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి అంటే సామాన్యుని పార్టీ కుల, మత, ప్రాంత వివక్షలకు అతీతంగా అన్ని వర్గాలను గౌరవించే పార్టీ అని అన్నారు. ఇందులో సీనియర్ నేతలకు గౌరవం ఉంటుంది, అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని అన్నారు. సుబ్రమణ్యం లాంటి నేతల చేరికతో పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. సుగవాసి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్ జగన్ నేతృత్వంపై నాకు విశ్వాసం ఉందని అన్నారు. ప్రజల కోసం పనిచేసేలా, పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానున్నారు. నాకు ఇక్కడ గౌరవం, అవకాశాలు ఉంటాయని నమ్మకం ఉంది అని అన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిజిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించారని వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని అనేకసార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. కలెక్టర్, జెసి తీసుకోవాలని లేబర్ అధికారుల ద్వారా ఆదేశాలు ఇచ్చినప్పటికీ, జిల్లా అధికారులమాట రిమ్స్ అధికారులు ఖాతరు చేయకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ బాల నారాయణరెడ్డి జిల్లా అధికారుల మాట ఖాతరు చేయకపోవడం దుర్మార్గమని తెలిపారు. రెడ్డి ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టినప్పటికీ బాలనారాయణరెడ్డిని రిమ్స్ అధికారులు కొనసాగించడంలో అంతర్యం ఏమిటని పేర్కొన్నారు. కార్మికుల రక్తం తాగుతున్న బాల నారాయణరెడ్డికి రిమ్స్ అధికారులు వత్తాసు పలకడం అన్యాయమని తెలిపారు. రిమ్స్‌లో ఉన్న అధికారులకు, జిల్లా అధికారుల కన్నా బాల నారాయణ రెడ్డి మాట ముఖ్యం అన్నట్టుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సక్రమంగా పీఎఫ్, ఇఎస్ఐ, మినిమం వేతనం ఇవ్వకుండా రిమ్స్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమని తెలిపారు. ఇలాంటి ఘాతుకానికి, మోసానికి పాల్పడుతున్న బాల నారాయణరెడ్డిని ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి తక్షణమే అరెస్ట్ చేయాలని. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. తొలగించిన ముగ్గురు కార్మికులను విధుల్లోకి తీసుకుని బాల నారాయణరెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని తెలిపారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన

కళ్లకు నల్ల బ్యాడ్జీలతో నిరసన ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం నగరపాలక సంస్థ ఎదుట కళ్ళకు గంతలు కట్టుకొని కార్మికులు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైనా సమస్యలు పరిష్కరించాలని కొద్దీ రోజులుగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోపోవడం సిగ్గు చేటన్నారు. ఆప్కాస్ రద్దు చేసి వారిని పర్మినెంట్ చేయాలని జిఒ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. తల్లికి వందనం అమలు చేయాలని తెలిపారు. పనిముట్లు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.13,087తో వారు పిల్లలన్ని పోషించి చదివించడం సాధ్యమని చెప్పారు. ఆప్కాస్‌లో ప్రభుత్వ ఉద్యోగి అని తొలగించి వారికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వం చర్చ లతో కాలయాపన చేసుకోకుండా కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో జూలైలో అన్ని ప్రజా సంఘాలు కలుపు కుని వాటర్, లైట్టింగ్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్, కార్యాలయ సిబ్బంది, అన్ని సెక్షన్ వారు మెరుపు సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి ఆనంద రావు, పర్మినెంట్ నాయకులు కొండయ్య, శరత్ శ్రీకాంత్, రాంమోహన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, లింగం పల్లి బద్రి, వెంకట సుబ్బయ్య, శివ, సిద్దయ్య, లైట్టింగ్ ప్రవీణ్, శ్రీను, రాజా, శివ, శంకరయ్య, మహేశ్వర రెడ్డి, సుబ్బయ్య, సందీప్, రామ చంద్ర రెడ్డి,లక్ష్మి దేవి, టౌన్ ప్లానింగ్. సురేంద్ర. సుబ్బయ్య. మస్తాన్. నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల సమస్యల పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆస్పత్రి సంఘ గౌరవ అధ్యక్షులు రాఘవ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు 65 మంది పని చేస్తున్నారన్నారు వీరికి వేతనాలు అందక పలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. కార్మికులకు ఇచ్చే వేతనం చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం కార్మికులకు రూ.16,400 ఉంటే వీరికి రూ.12,400 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ జీతం కూడా నాలుగు నెలల నుంచి అందడం లేదన్నారు. ఒక నెల జీతం రాకుంటేనే ఇబ్బందులు ఉంటాయని అలాంటిదే నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని వాపోయారు. కాంట్రాక్టర్ బాలనాగి నాయుడు తక్షణం స్పందించి కార్మికులకు బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు అలాగే కార్మికుల కొంతమందికి పిఎఫ్, ఈఎస్ఐ ఇంతవరకు వాళ్ళ ఖాతాలో పడలేదని వెంటనే వీటిని అమలు చేయాలని కోరారు. కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. బకాయి ఉన్న నాలుగు నెలల వేతనం జూలై 1వ తేదీ లోపు అందని పక్షంలో సమ్మె అనివార్యమవుతుందన్నారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి యూనియన్ అధ్యక్షులు రత్తమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సహాయ కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్, కమిటీ సభ్యులు నరసింహులు, ప్రసాదు, రాణి, దేవి, మల్లమ్మ రామేశ్వరం లక్ష్మీ, చెన్నమ్మ, జ్యోతి అక్క, మరియమ్మ, మార్తమ్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

చదువుల వ్యాపారాన్ని అరికట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చదువుల పేరుతో లక్షల వ్యాపారాని తెర లేపారని, వీటిని అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడియం చిన్ని తెలిపారు. బుధవారం కడపలో కలెక్టర్ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టాన్ని ఎక్కడ అమలు చేయకుండా చదువుల పేరుతో లక్షల వ్యాపారానికి తెరలేపారని విమర్శించారు. ప్రధానంగా కార్పొరేట్ సంస్థలైన చైతన్య, నారాయణ, భాష్యం లాంటి విద్యాసంస్థలలో ఫీజుల రూపంలో లక్షల రూపాయలు తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో ఇతర వస్తువులు ఏవి అమ్మకూడదని తెలిపారు. నిబంధన ఉన్న ప్రతి విద్యా సంస్థలో ఫీజులు పట్టిక డిస్ప్లే చేయాలని ఉన్న ఎక్కడ ఇది అమలు కావడం లేదని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు కల్లుండి చూడలేని పరిస్థితిలో నిద్రావస్థలో జోగుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను తనిఖీలు వంటివి నిర్వహించకపోవడం కారణం చేత విచ్చలవిడితనం మరింత పెరిగిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను తనిఖీలు నిర్వహించి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోవు రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సమావేశంలో నగర కార్యదర్శి విజయ్, నాయకులు సాయి పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక లాభాలు : ఎడిఎ

ప్రజాశక్తి-వల్లూరు

రైతులు విత్తన శుద్ధి చేసి పంట వేసినట్లయితే అధిక లాభాలు గడించొచ్చని కమలాపురం ఎడిఎ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం వల్లూరు మండలం గోటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలుచేసే ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క రైతు నేల యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడుకోవాలని తెలిపారు. డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, సాంకేతిక వ్యవసాయ అధికారి నాగభూషణ్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంటలు సాగు చేసిన అనంతరం పంట నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మినుము పంట సాగు చేసే రైతులకు త్వరలోనే మినీ కిట్స్ రూపంలో అందిస్తామని తెలిపారు. మినుము పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి లేకుండా పంటను కాపాడుకోవాలని పేర్కొన్నారు. డిపిఎం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి రైతు జీవామృతం ఘనజీవామృతం ఉపయోగించుకొని నేల ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ విఎఎ ఇంద్రజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

- రిమ్స్ క్లినికల్ సైకాలజిస్ట్ భాస్కర్

ప్రజాశక్తి - కడప

మాదక ద్రవ్యాల అలవాటు వల్ల యువత ప్రమాదకరమైన జబ్బుల పాలై వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని రిమ్స్ క్లినికల్ సైకాలజిస్ట్ భాస్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ఏదో ఒక రకమైన డ్రగ్స్‌కి అలవాటు పడి ఉన్నారని, వాటిని మానుకొని ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిరోధకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప పట్టణ సిఐ రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి వాటితో మతిస్థిమితం కోల్పోతున్నారని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ నేడు మత్తు పదార్థాలు సేవించే వారిలో 15 నుంచి 50 సంవత్సరాల వయస్సు లోపు వారే అధికంగా ఉండటం విచారకరమని పేర్కొన్నారు. యువత మత్తుకు బానిసలు కావద్దన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల అలవాటు వల్ల వారి విలువైన భవిష్యత్తును కోల్పోతారని అన్నారు. ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్లు కెప్టెన్. డాక్టర్.నీలయ్య, డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థుల చదువుతోపాటు వారి నడవడిక, అలవాట్లు, స్నేహాలు గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావం పై ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పిస్తూ ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సైకాలజిస్ట్ భాస్కర్

కాలువ పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

కెసి కెనాల్ ఆయకట్టు అభివృద్ధికి చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఉపాధ్యక్షులు తుంగా చెంద్రాయుడు పేర్కొన్నారు. బుధవారం భూమాయపల్లిలో కెసి కెనాల్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. కంప చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా చెంద్రాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఏటా చివరి అయికట్టుకు నీరు ఆలస్యంగా చేరేదన్నారు. సకాలంలో చివరి అయ కట్టు వరకు నీరు అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు గోగు శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, లస్కర్ దస్తగిరి పాల్గొన్నారు.

రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి

ప్రజాశక్తి - చాపాడు

నారుపల్లె జగన్‌మోహన్ రెడ్డి

అన్నదాత సుఖీభవ పథకాన్ని డికెటి, చుక్కల భూములు, కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు నారుపల్లె జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ పథకం వల్ల సన్న, చిన్నకారు రైతులైన డికెటి పట్టాదారులకు, చుక్కల భూములు ఉన్నవారికి పథకం వర్తించదని చెప్పడం బాధాకరమన్నారు. వాస్తవంగా డికెటి పట్టాదారు రైతులు, బడుగు బలహీన వర్గాల వారు, అగ్రవర్ణాలలో పేద రైతుల చేతుల్లోనే డికెటి భూములు ఉన్నాయని, వారికే ఈ పథకం వర్తించదంటే ఈ ప్రభుత్వం సన్న, చిన్న కారు, రైతుల పట్ల చూపుతున్న ప్రేమ ఏమాత్రం ఉందో అర్థం అవు తోందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పేదవారిని దృష్టిలో పెట్టు కొని అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వరికి ప్రత్యామ్నాయం ఆయిల్ ఫామ్ సాగు చేసుకుంటూ అధిక లాభాలు సాధించవచ్చని ఇన్‌ఛార్జి ఉద్యాన అధికారి జయభరత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉద్యాన శాఖ అద్వర్యంలో మండల పరిధిలోని ఉప్పరపల్లి, తాళ్లమాపురం, నంగునూరిపల్లి, కామనూరు, సోములవారిపల్లి గ్రామాల్లో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు 12 మండలాలకు అనుమతి లభించిందన్నారు. వరి సాగు ఎక్కువగా చేస్తున్న ప్రొద్దుటూరు మండలం ఎంపికైందన్నారు. భారతదేశం ఎక్కువ శాతంలో వంట నూనెలు దిగుమతి చేసుకుంటోందన్నారు. ముఖ్యంగా ఫామ్ ఆయిల్ 50 శాతంపైగా దిగుమతి చేసుకుంటుందన్నారు. వంట నూనె దిగుమతి వ్యయం తగ్గించటానికి ఆయిల్ ఫామ్ పంటను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో సువేన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు కొండారెడ్డి, తేజ రైతు సేవ కేంద్ర సిబ్బంది హరేంద్ర, ప్రతాప్, నర్సింహులు పాల్గొన్నారు.

రేపు ఆయిల్ ఫామ్ పంట సాగుపై శిక్షణ

ప్రజాశక్తి - వేముల

ఆయిల్ ఫామ్ సాగుపై రైతు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఉద్యాన శాఖ, ఎంకె ఆగ్రోటెక్ ప్రయివేట్ లిమిటెడ్ అధ్యర్యంలో ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో నిర్వహించున్నట్లు హెచ్ఒ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్ర బాబు పాల్గొంటారన్నారు. అభ్యుదయ రైతులు, ఆయిల్ ఫామ్ పంట సాగు చేయదలచిన రైతులు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

పోలవరం-బనకచర్ల రాష్ట్రానికి గుదిబండ

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్లు పోలవరం-బనకచర్ల రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కాదని, అది ఒక గుదిబండగా తయారవుతుందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ముందుకే పోవాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. పోలవరం-బనకచర్ల అంచనా విలువ రూ.81,900 కోట్లు అన్నారు. ఇందులో సింహ భాగం అప్పు అన్నారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందని చెప్పారు. ఈ ప్రాజెక్టు వలన రాష్ట్రం శాశ్వతంగా అప్పుల ఊబిలో కూరుకుపోతుందని పేర్కొన్నారు. తెలంగాణకు కాళేశ్వరం గుదిబండ అయినట్లు ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు గుదిబండ అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద 50 వేల ఎకరాలు ఉందని, ఇది చాలక ఇంకా 44 వేల ఎకరాల భూమిని సమీకరించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా చేస్తోందా లేక రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందా అని ప్రశ్నించారు.

కేంద్ర మంత్రివర్గ తీర్మానం హాస్యాస్పదం

భారత దేశ పరిస్థితుల వల్ల 50 ఏళ్ల క్రితం నాటి ప్రధాని ఇందిరమ్మ విధించిన ఎమర్జెన్సీని ఖండిస్తూ మోడీ పాలనలో కేంద్ర మంత్రి వర్గం తీర్మానం చేయడం హాస్యాస్పదమని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేరొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1975లో 352 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగ బద్ధంగా నాడు ఇందిరమ్మ ప్రకటిత ఎమర్జెన్సీ విధించారని చెప్పారు. నాడు ఎమర్జెన్సీ ఉన్నది 21 నెలలు మాత్రమేనని, మళ్లీ ఇందిరమ్మనే ఎమర్జెన్సీ ఎత్తివేసి ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిపించారన్నారు. ఆ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఓడి పోయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 లోక్ సభ స్థానాలకుగాను 41 స్థానాలలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించడం గమనార్హం అన్నారు. ప్రస్తుతం మోడీ పాలనలో గత 11 సంవత్సరాలుగా రాజ్యాంగ వ్యతిరేకంగా అప్రకటిత ఎమర్జెన్సీ అమలు అవుతున్నట్లు చెప్పారు. మోడీకి ప్రజాస్వామ్యం పట్ల చిత్తశుద్ధి ఉంటే అప్రకటిత ఎమర్జెన్సీ నుండి దేశానికి విముక్తి కలిగించాలని తులసి రెడ్డి సూచించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో స్టాంపుల కొరత

బ్లాక్ మార్కెట్లో నడుస్తున్న దళారుల హవా - రెట్టింపు ధరతో స్టాంపుల విక్రయాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గంలో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో స్టాంపులు కొరత తీవ్రంగా ఉంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పులివెందుల రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల, వేముల, పులివెందుల రూరల్, మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజు పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్ జరుగుతుంటాయి. నోటరీ, అఫిడవిట్, అగ్రిమెంట్ తదితర వాటికి స్టాంపులు వందల సంఖ్యలో విక్రయాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంపులు లేవని చెప్పడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్లాక్ మార్కెట్లో దళారుల హవా..

స్టాంపులు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొరత.. స్టాంప్ వెండర్ల దగ్గర లభించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్టాంపు వెండర్లు రెట్టింపు ధరలతో విక్రయిస్తున్నారు. రూ.50 స్టాంపును రూ.వంద విక్రయి స్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో లభించకపోవడంతో స్టాంపు వెం డర్లను ఆశ్రయించాల్సి వచ్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధి కారులు స్పందించి స్టాంపులు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

బొల్లి అంటు వ్యాధి కాదు.. వారిలో ధైర్యాన్ని నింపాలి

ప్రజాశక్తి - కడప సిటీ

బొల్లి (మచ్చలు) అంటువ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధి కాదని జిజిహెచ్ (రిమ్స్) డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు.ప్రపంచ విటిలిగో డే (బొల్లి మచ్చ దినోత్సవం) సందర్భంగా కడప జిజిహెచ్‌లోని చర్మ వ్యాధుల (డెర్మటాలజీ) విభాగంలో సంబంధిత హెచ్ఒడి డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో బొల్లి మచ్చలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లి వంశపారపర్యంగా రాదన్నారు. వివాహానికి బొల్లి వ్యాధి ఎలాంటి అడ్డుకాదని వివరించారు. బొల్లి మచ్చల వలన ఒక వ్యక్తి శారీరక, మానసిక సౌరర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే చర్మవ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. తెల్లమచ్చలు, బొల్లితో ఉన్న వారి పట్ల వివక్షతను చూపకుండా సమాజంలో అందరితో సమానంగా ఆదరించాలని ఆయన సూచించారు. వ్యాధిగ్రస్తులను అందరితో కలివిడిగా ఉండేలా మానసిక ధైర్యాన్నిచ్చి చికిత్స చేయించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెర్మటాలజీ విభాగం వైద్యులు సుభాషిణి, నరోత్తమరెడ్డి, విజయ కుమారి, షాలిని, పిజి వైద్యులు, ఇతర వైదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిజిహెచ్ డెర్మటాలబజీ హెచ్ఒడి డాక్టర్ పెచలయ్య

ఖరీఫ్ సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి

పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఖరీఫ్ సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి అని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య రైతులకు సూచించారు. మండలంలోని ఒంటిగారిపల్లె గ్రామంలో బుధవారం ఎడి ఆధ్వర్యంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన సూక్ష్మ పోషకాలు ప్రభుత్వం రాయితీ ద్వారా అందిస్తుందన్నారు. కావాల్సిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కంది పంట సాగు చేసే రైతులకు త్వరలోనే మినీ కిట్స్ అందిస్తామన్నారు. పత్తి పంటను పరిశీలించి రసం పీల్చే పురుగుల ఉధృతి నుంచి కాపాడుకునేందుకు పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలన్నారు. ఎకరానికి 8 చొప్పున లింగాకర్షక బట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పక్షి స్థావరాలు పంటకు అడుగు ఎత్తులో అమర్చుకుంటే పక్షులు పురుగు ఉధృతిని అరికడతాయన్నారు. వామికొండ జలాశయం వల్ల పొలాల్లోకి నీటి ఊటలు ఏర్పడి తేమ శాతం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో గ్రామ విహెచ్ఎ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట : రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

చక్రాయపేట : మండలంలోని మహాదేవపల్లి, గంగారపువాండ్లపల్లెలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు అంశాలపై రైతులకు సూచనలు ఇచ్చారు. ఉద్యానవన శాఖ కూరగాయల సాగ చేసే విధానం, సంపద పెంచే పారంపాండ్స్, రాబోమే రోజుల్లో పూలసాగు, మల్చింగ్ తదితర వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. గంగారపులాండ్లపల్లెకు చెందిన రైతు రామాంజనేయరెడ్డి పంటను సందర్శించారు.

సింహాద్రిపురం : ప్రతి రైతు విత్తనం వేసే సమయంలో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కళ్యాణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సుంకేసుల, పైడిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో 70 మంది రైతులకు భూసార పరీక్షలు జరిపించామన్నారు. వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులు వేసుకున్నట్లయితే పెట్టుబడి ఖర్చు తగ్గించవచ్చునని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలకు సంబంధించి ఎక్కడైనా విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదు తీసుకొని విత్తనం విత్తిన నెలరోజుల వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. జింకు, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలు త్వరలో ప్రభుత్వం రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. పంట మార్పిడి పద్ధతులు ప్రతి రైతు ఆచరించాలన్నారు. ఈ విధానం ద్వారా చీడపీడల ఉధృతిని తగ్గించవచ్చునని, భూసారం దెబ్బతినకుండా ఉంటుందని ఆయన వివరించారు. దీపిక, ప్రత్యుష, రైతులు పాల్గొన్నారు.

తొండూరు : మండలంలోని భద్రంపల్లి గ్రామంలో వ్యవసాయాధికారులు బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ కె.రాజు రైతులతో కలిసి పంట పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎఒ పంటల నాణ్యత, మట్టి ఆరోగ్యం, సమయానికి సాగు నడపడం, సమర్థ వంతమైన పురుగు మందుల వాడకం వంటి అంశాలపై రైతులకు అవ గాహన కల్పించారు. ప్రత్యేకంగా ఖాతాదారీ వ్యవస్థ ప్రయోజనాలు, ప్రభు త్వం అందజేస్తున్న అనేక రకాల ఉచిత సలహాలు, సేవలు గురించి వివ రించారు. రైతులు కూడా తమ సందేహాలను అధికారులతో పంచుకున్నారు.

చాపాడు : రైతులు అనుమతి లేని విత్తనాలను కొనుగోలు చేయకూడదని మైదుకూరు డివిజన్ వ్యవసాయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాలలో వ్యవసాయ అధికారి దేవి పద్మలత ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎడిఎ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయం పనుల్లో నిమగ్నం అవుతున్నారన్నారు. ఎఒ పద్మలత మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారం రోజుల్లో పంపిణీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు గుత్తి వీరనారాయణ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ కృష్ణమూర్తి

చౌకదుకాణం డీలర్‌పై తహశీల్దార్ వేధింపులు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని మహాదేవపల్లె చౌక దుకాణం డీలర్‌ను తహశీల్దార్ విజయకుమారి వేధిస్తున్నారని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి, ఎంపిపి మాధవి బాలకృష్ణ ఆరోపించారు. మహదేవపల్లె చౌక దుకాణం డీలర్‌గా ఊరుమిండి అంజనమ్మ 1995 నుంచి ఉంటున్నారన్నారు. ఇంతవరకు ఆమెపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. ఇటీవల అధికారులపై కొందరు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి ఆమెను సస్పెండ్ చేయించారన్నారు. దీనిపై ఆమె హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నా.. విచారణ పేరుతో టిడిపి నేతలు ఒకరిద్దరిచ్చే ఫిర్యాదులపై తహశీల్దార్ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. డీలర్‌పై ఫిర్యాదు వస్తే తహశీల్దార్ గ్రామంలోకి వెళ్లి డీలర్ సమక్షంలోనే విచారించాలని కోర్టు ఆదేశించిందన్నారు. మహాదేవపల్లెలో అందుకు విరుద్ధంగా జరుగుతోందన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇంటి వద్దకు తమ సిబ్బందిని పంపి వారి దగ్గర నుంచి డీలర్లకు తెలియకుండానే స్టేట్మెంట్లు తీసుకొని వచ్చి సస్పెన్షన్లకు సిఫారసు చేస్తున్నారని వివరించారు. గ్రామంలో తనపై ఏదైనా ఆరోపణలు ఉంటే తాను బహిరంగంగానే క్షమాపణ చెప్పి, డీలర్ షిప్‌ను వదులుకుంటానని అంజనమ్మ చెప్పారన్నారు. ఇచ్చినప్పటికీ రెవెన్యూ వారు మాత్రమే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

అల్లరి మూకలను నియంత్రించండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ముద్దనూరు రోడ్డులోని పతంగి రామన్న ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అల్లరి మూకలను ఉన్నతాధికారులు నియంత్రించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షులు సుబహాన్ కోరారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పిఆర్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఈ మధ్యకాలంలో అల్లరి మూకలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందన్నారు. అధికారులు, పాఠశాల యాజమాన్యం తనిఖీలు నిర్వహించి అసౌకర్యానికి గురి చేస్తున్న అల్లరి మూకలను నియంత్రించాలని వారు కోరారు. పోలీసులు రాత్రి సమయంలో గ్రౌండ్‌లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. గ్రౌండ్‌కు ప్రహరీ కూలిపోయిందన్నారు. అధికారులు స్పందించి దాన్ని పునర్నిర్మించాలని కోరారు.

వినతిపత్రాన్నిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

కుక్కల బెడద తప్పించాలని వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్థానిక గోపవరం పంచాయతీలోని ఉప్పాగులో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి, భయభ్రాంతులకు గురవుతున్నారని, వీటిని నియంత్రించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ కోరారు. ఆ మేరకు బుధవారం గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఉప్పాగు ప్రాంతంలో ప్రజలకు వీధి కుక్కల బెడద ఎక్కువైందన్నారు. ఈ మధ్యకాలంలో వీధి కుక్కలు కరిచిన సంఘటనలు ఉన్నాయన్నారు. రాత్రి సమయంలో వీటి నుండి మరింత ప్రమాదకరంగా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. అధికారులు సమస్యను గుర్తించి వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నామన్నారు.

తల్లిదండ్రులతో కలిసి మాట్లాడుతున్న శ్రీపతి చక్రవర్తి

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి..!

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టిడిపి నాయకుడి ముసుగులో భూ ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, అతడు, అతని అనుచరుల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని పులివెందుల పట్టణానికి చెందిన శ్రీపతి చక్రవర్తి పోలీసులను ఆశ్రయించారు. ఆ మేరకు బుధవారం తల్లిదండ్రులు శ్రీపతి రామమునెమ్మ, శ్రీపతి బాలుడుతో కలిసి శ్రీపతి చక్రవర్తి స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2008 ఫిబ్రవరిలో తన తండ్రి శ్రీపతి బాలుడు తన తల్లి శ్రీపతి రామమునెమ్మ పేరుతో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 335/2, 336/2, 337 సర్వే నెంబర్లలో 2.67 సెంట్లు మల్లెల రాజేశ్వరి వద్ద కొనుగోలు చేసి, పులివెందుల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెండు ఎకరాల 65 సెంట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. దాని లేఔట్‌గా మార్చి లే అవుట్ రూపంలో అమ్మినట్లు తెలిపారు. అందులో ఉన్న పదో నెంబర్ ప్లాట్ మాత్రం తమ పేరున ఉందని, దానిని పులివెందుల టిడిపి నాయకుడు భార్య పేరుపై 2025 జనవరిలో దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకుని తమను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్లాట్‌లో వేసిన షెడ్డును అర్ధరాత్రి డోజర్లతో తొలగించి చదును చేసి ఆక్రమించారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోలీసులు రక్షణ కల్పించాల్సింది పోయి మమ్మల్ని బెదిరించారని, కలెక్టర్, రెవెన్యూ అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించుకున్నా ప్రయోజనం లేదన్నారు. పోలీసులు కూడా తామేమీ చేయలేము.. మాపై రాజకీయ ఒత్తిడి ఉంది.. మీకు రక్షణ కల్పించలేమని చెప్పారని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని మా కుటుంబంపై దాడులకు దిగుతున్న టిడిపి నాయకుల నుండి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయం

ప్రజాశక్తి - వేంపల్లె

భారత దేశ ప్రజాస్వామ్యంలో 50 ఏళ్ల క్రితం అత్యంత చీకటి అధ్యాయంగా చెప్పుకోవచ్చునని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, తెలుగు శాఖ ఆధ్వర్యంలో సమ్విధాన హత్య దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయాలలో అత్యవసర పరిస్థితి విధించబడి నేటికి 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని హరించిన ఏ ప్రభుత్వం ఎక్కువకాలం ప్రజాభిమానాన్ని పొందలేదన్నారు. చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ 1975లో నాటి ఇందిరా గాంధీ నిర్బంధించిన ఎమర్జెన్సీ కాలం భారతదేశ చరిత్రలో చాలా గడ్డు కాలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎల్.నాగలక్ష్మి దేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అరవింద్, షేక్ షఫీ ఉద్దీన్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుధాకర్, లైబ్రరీయన్ పి.మాధవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగేంద్ర

ప్రతిభ కనబరిచిన ఎస్ఆర్ఐటి విద్యార్థులు

ఎస్ఆర్ఐటి డిప్లమా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎపి ఎస్‌బి టెట్ ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫోర్త్ సెమిస్టర్ ఫలితాలలో ఎస్ఆర్ఐటి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడిలు అభినందించారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ముద్దనూరు : ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆటో డ్రైవర్ జలాలు మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధు సూదనరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు రూ.50వేలు ఆర్థికసాయం చేశారు. స్థానిక వెంకటరెడ్డి కాలనీలో ఉంటున్న జలాలుకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

పాడుబడిన బావి..పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో ప్రధాన వీధికి, పాఠశాలకు సమీపంలో పాడుబడిన పురాతన బావి ఉంది. ఈ బావితో ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బావి చుట్టూ రక్షణ లేదు. రక్షణ గోడ అయినా నిర్మాణం చేపట్టాలని, లేదా పూడ్చాలని స్థానికులు కోరుతునా్నరు. సమస్యను పలుమార్లు ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదన్నారు. విద్యార్థులు, అటుగా వెళ్లే ప్రజలు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణాలకు ముప్పు వాటిల్లే ఆస్కారం లేకపోలేదు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.



IN THE COURT OF THE HON'BLE 2ND ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

O.S.No. 997 OF 2023

GUMMALA PRASAD REDDY, Son of Venkata Subba Reddy, cultivation, residing at Door No: 9/104, Mattavari Street, Chennur Village & Mandal, Kadapa District.

...Plaintiff

Vs

DEVARASETTY MOHAN BABU, Son of D. China Peeraiah, Hindu, aged about 48 years, Business, Residing at Door No: 75/27-1, Vijaya Durga Colony, Kadapa City.

...Defendant

SUMMONS TO DEFENDANT UNDER ORDER 5 RULE 1 & 5 C.P.C

Where as the Plaintiff herein filed the suit against you being Defendant for recovery of debt due under Suit Pronote and the said suit stand posted on 01-07-2025 for your appearance therefore you being the Defendant here by instructed to appear before the Hon'ble court on 01-07- 2025 at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & ABBAS KHAN

Advocates for Plaintiff

THE COURT OF THE HONORABLE IV NATIONAL DISTRICT JUDGE, KADAPA

G.O.P.No.7/2025

1. Kanakaparthi Veera Jaydeepa Reddy, minor represented by it's a natural guardian mother
2. Kanakapati Lakshmi Narasamma

...Petitioners

Vs

NIL. ...Respondent

GENERAL NOTICE

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా కనకపర్తి లక్ష్మీ నరసింహా కుమారుడు కనకపర్తి వీర జగదీప రెడ్డి, మైనర్ పేరు మీద ఉన్న ఆస్తిని అమ్ముకొనుటకు కోర్టు అనుమతి కోరుతూ VI అదనపు జిల్లా జడ్జి కోర్టులో G.O.P.No.7/2025 దాఖలు చేయడమైనది. ఎవరికైనా ఎలాంటి అభ్యంతరం ఉన్న 26.06.2025 నుండి తమ అభ్యంతరాలను జడ్జికి గారికి వ్రాత మూలకంగా ఫిరియాధులు చేయగలరు.

ఆస్తి షెడ్యూలు

Kadapa District, Kadapa Rural Sub District, Pendlimarry Mandal and Grama Panchayat and village fields with the following survey numbers and extent

సర్కారు పుంజి డీ.No.660-14లో 0.25
సర్కారు పుంజి డీ.No.660-2లో 0.56
సర్కారు పుంజి డీ.No.660-7లో 0.39
మూడు సర్వే నంబర్ల విస్తీర్ణం య.1.20 సెంట్లు

షేక్ అమీన్ పిరా,

అడ్వకేట్, కడప. సెల్ : 93464 07720